క్లుప్తంగా

కళాశాలపై చర్యలు తీసుకోండి



వినతిపత్రం అందజేస్తున్న టీజీవీపీ నేతలు

నిజామాబాద్అర్బన్: అనుమతులు లేకుండా కొనసాగుతున్న ఓ ప్రైవేట్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం టీజీవీపీ నాయకుడు కల్యాణ్‌రామ్ జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఓ ప్రైవేట్ కాలేజీ వారు ఎలాంటి అధికారిక అనుమతులు లేకుండా విద్యాసంస్థను నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కళాశాలపై తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. నేతలు మహేష్, సుజిత్, రాకేష్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత



రుద్రూర్: ఆధ్యాత్మికత.. మానసిక ప్రశాంతతకు మార్గమని, ప్రతి ఒక్కరు భక్తి భావాన్ని అలవర్చుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. పొతంగల్ మండలం సోంపూర్‌లో బుధవారం ఆయన పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలకు హాజరయ్యారు. గ్రామంలో కొనసాగుతున్న అఖండ శివనామ సప్తాహం, నూతనంగా నిర్మించిన శివాలయంలో విగ్రహ, శిఖర ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే గ్రామంలో ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆధ్యాత్మికత.. క్రమశిక్షణ, నిజాయితీని అలవాటు చేస్తుందన్నారు. రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు, మాజీ జెడ్పీటీసీ శంకర్ పటేల్, మాజీ ఎంపీపీలు పుప్పాల శంకర్, గంధం పవన్ కుమార్, ఏఎంసీ మాజీ చైర్మన్ సీహెచ్ గంగాధర్, నాగ రాజు గౌడ్, ఎజాజ్‌ఖాన్ పాల్గొన్నారు.

అమరవీరులకు నివాళులు



ఆర్మూర్‌టౌన్: ఆపరేషన్ సింధూర్‌లో భాగంగా ఉగ్రవాదుల స్థావరాలపై జరిగిన దాడుల్లో వీర మరణం పొందిన అమరవీర జవాన్ల ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షిస్తూ ఆర్మూర్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు కొవ్వొత్తులతో, అమరుల వీరులకు నివాళులు అర్పించి రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. అసోసియేషన్ అధ్యక్షుడు జక్కుల శ్రీధర్, ప్రధాన కార్యదర్శి జెస్సు అనిల్ కుమార్, న్యాయవాదులు పండిత్ కృష్ణ, చిలుక కిష్టయ్య, విప్లవ్ కిరణ్, నర్సయ్య, బేతు జగదీష్, వెంకట్రావు షిండే, ఐనారి అశోక్, మామిడి రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఎత్తిపోతల కమిటీ ఎన్నిక



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం మగ్గిడి, ఖానాపూర్, అందాపూర్ గ్రామాల రాజీవ్ గాంధీ ఎత్తిపోతల కమిటీ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్‌గా బద్దం నాగరాజ్, వైస్ చైర్మన్‌గా తాడుశెట్టి సుమన్, కోశాధికారిగా నగ్నూర్ అశోక్, కార్యదర్శిగా నలిమెల చిన్నారెడ్డి, డైరెక్టర్లుగా భూమారెడ్డి, దినేష్, రాజేశ్వర్, రాజన్న, నర్సయ్య ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ.. సాగు నీటికి లోటు రాకుండా కృషి చేస్తామన్నారు.

కొనుగోళ్లు పూర్తి చేయండి

మాక్లూర్: ధాన్యం కొనుగోళ్లను త్వరితగతిన పూర్తి చేసి, రైతుల ఖాతాల్లో డబ్బులు వేయించే పక్రియను వేగవంతం చేయించాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకుడు నూతుల శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా అధికార యంత్రాంగాన్ని కోరారు. బుధవారం మండలంలోని గుత్ప, అడవి మామిడిపల్లి గ్రామాలలో పర్యటించి రైతులు కల్లాలపై ఆరబెట్టుకున్న ధాన్యాన్ని పరిశీలించారు. వరి ధాన్యం ఎండకు ఎండి తాలిపోతున్నాయంటూ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. ఒక వైపు వర్షాకాలం ముంచుకొస్తుందన్నారు. అకాల వర్షాలు పడి కల్లాలపై ఆరబెట్టి ఉన్న ధాన్యం తడిస్తే రైతు చేతికి గింజ వరిధాన్యం దక్కదన్నారు. ఇకనైనా అధికార యంత్రాంగం స్పందించి కొనుగోలు కేంద్రాల్లో కాంటాల వేగం పెంచాలన్నారు. నాయకులు జెస్సు అనిల్, పులి యుగంధర్, అల్జాపూర్ రాజేష్, చింత ప్రవీణ్‌రెడ్డి, చిన్నాపూర్ వినోద్, డి.రమేష్ ఉన్నారు.

సిర్నాపల్లి గడీ @ ఇందూర్

ఇందూర్ చరిత్ర

- ఇక్కడే సంస్థానం కార్యాలయాలు
- ఎకరం భూమిలో భవనాలు



సంస్థానాధీశురాలు శీలం జానకీబాయి

ఖలీల్‌వాడి: ఇందల్వాయి మండలంలోని సిర్నాపల్లి గడీ ఒక్కటే కాదు మరో సిర్నాపల్లిగడి నిజామాబాద్ నగరంలో ఉంది. సిర్నాపల్లి సంస్థానాధీశురాలు శీలం జానకీబాయి 150 ఏళ్ల క్రితం 118 గ్రామాలను పరిపాలించేవారు. ఈ పాలన వ్యవహారాలను సిర్నాపల్లి గ్రామం నుంచి పర్యవేక్షించేవారు. ఇందూర్ అప్పటికే ఈ సంస్థానంలో పెద్ద పట్టణం కావడంతో ఇక్కడే అన్ని ప్రాంతాల ప్రజలు నివసించేవారు. ఇక్కడే ప్రధాన వ్యాపారాలు ఈ సంస్థానంలో జరిగేవి. దీంతో సంస్థానాధీశురాలు శీలం జానకీబాయి ఇందూర్‌లో సర్నాపల్లిగడీ నిర్మించి ఇక్కడి నుంచి తన కార్యాకలపాలను నిర్వహించేదని పెద్దలు చెబుతున్నారు. ఈ గడీ ఇప్పటికీ చెక్కుచెదరకుండా చరిత్రకు సాక్ష్యంగా నిలుస్తోంది. ప్రస్తుతం ఈ సిర్నాపల్లి గడీ సర్వసమాజ్ కమిటీ ఆధ్వర్యంలో ఉంది.



సిర్నాపల్లి గడీ

■ ఎకరం భూభాగంలో నిర్మాణం

సిర్నాపల్లిగడి అంటే ఇందూరు నగరంలో తెలియని వారు ఉండరు. ఈ గడీతోపాటు స్థలం సుమారు ఎకరం భూభాగంలో ఉంటుంది. ఈ గడీకి ముందు స్వాగత తోరణం ఉంటుంది. ఈ గేటు ముందే గోల్‌హనుమాన్ టెంపుల్ ఉంది. ఉత్తరం దిక్కున సిర్నాపల్లిగడి మైసమ్మ గుడి ఉంది. ఇక్కడ నగర ప్రజలు ఆదివారం పూజలు నిర్వహిస్తారు. ఈ గడీలో అధికారులు శిస్తు వసూలు, సంస్థాన పరిపాలన వ్యవహారాలను అప్పట్లో సంస్థానం అధికారులు చూసేవారని చెబుతున్నారు.

■ ఇక్కడే విడిదిగా ఉండేది..

సిర్నాపల్లి సంస్థాధీశురాలు శీలంజానకీబాయి సంస్థాన పనులలో భాగంగా ఇందూరు పట్టణంలోని తన గడీకి వచ్చేవారు. ఇక్కడే ఉండి ఈ ప్రాంతంలోని పాలన వ్యవహారాలను చూసేవారు. తర్వాత ఇక్కడే కొన్ని రోజుల పాటు విడిదిగా క్షేత్రంగా అప్పట్లో ఉన్నట్లు తెలుస్తోంది. శీలంజానకీబాయి ఇక్కడ విడిది చేసినప్పుడు వ్యాపారులు, రైతుల విజ్ఞప్తి మేరకు 1907లో ఐదు ఎకరాల స్థలంలో మహబూబ్ మార్కెట్‌ను నిర్మించారు. తర్వాత కాలక్రమేణా అది గాంధీగంజ్‌గా ప్రసిద్ధి చెందింది.



స్వాగత తోరణం

■ సర్వసమాజ్ కమిటీ ఆధీనంలో..

సిర్నాపల్లి సంస్థానాధీశురాలు శీలం జానకీబాయితోపాటు కుటుంబసభ్యుల పాలన తర్వాత ఈ గడీ ప్రస్తుతం సర్వసమాజ్ కమిటీ ఆధీనంలో ఉంది. ఈ కమిటీ ఇక్కడే నిజామాబాద్ నగరంలో చేసే పనుల గురించి సమావేశాలు నిర్వహిస్తారు. దీంతోపాటు ప్రతియేటా నిర్వహించే దసరా, ఊర పండుగలను ఇక్కడి నుంచే ప్రారంభిస్తారు. దీంతోపాటు జనన, మరణ ధ్రువీకరణలకు ఇక్కడ నుంచే సర్టిఫికెట్లను అందిస్తారు.



గడీ లోపల మైసమ్మ దేవాలయం

చరిత్రను కాపాడుతున్నాం



సిర్నాపల్లి సంస్థానాధీశురాలి చరిత్ర ముందుతరాలకు తెలియడానికి ఈ గడీని సర్వసమాజ్ కమిటీ రక్షిస్తుంది. ఇక్కడ నుంచి సిర్నాపల్లి సంస్థానాధీశురాలు సంస్థాగత పరిపాలన వ్యవహారాలు చూసేవారని పెద్దలు చెబితే విన్నాం. ఈ గడీ నుంచే దసరా, ఊర పండుగ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.శీలం జానకీబాయి వారసులు కూడా అప్పుడప్పుడు వచ్చి ఈ భవనాన్ని చూస్తారు. – ఆదె ప్రవీణ్, సర్వసమాజ్ కమిటీ కో–కన్వీనర్, నిజామాబాద్

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి



ధర్పల్లిలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ధర్పల్లి: ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని టీయూసీఐ నిజామాబాద్ రూరల్, కామారెడ్డి సంయుక్త జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ కోరారు. ఈ మేరకు ధర్పల్లి మండల కేంద్రంలో ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో బుధవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణితో కార్మికుల జీవన ప్రమాణాలు పడిపోయాయన్నారు. కార్మికులకు ఉద్యోగ, ఆరోగ్య భద్రత కరువైందన్నారు. సమ్మెలో జిల్లాలోని కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. నేతలు సుమన్, కృష్ణ, స్వరూప, రజిని, లక్ష్మి, శారద, షాహిని బేగం తదితరులు పాల్గొన్నారు.

సత్తా చాటిన 'ఏకలవ్య' విద్యార్థులు

ఇందల్వాయి: సీబీఎస్ఈ గ్రాండ్ టెస్ట్ ఫలితాల్లో ఇందల్వాయి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థినులు వంద శాతం ఉత్తీర్ణత సాధించి సత్తా చాటినట్లు ప్రిన్సిపల్ రమేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అత్యధికంగా లాకవత్ సౌందర్య 600 మార్కులు, నేనావత్ మానస 591 మార్కులు, కున్సోత్ ప్రణవి 576 మార్కులు సాధించినట్లు తెలిపారు. ఫలితాల్లో రాణించిన విద్యార్థినిలను ఉపాధ్యాయులు బుధవారం అభినందించారు.

పొలాల్లోకి పారిశ్రామిక వ్యర్థాలు

- కాలూర్, ఖానాపూర్ పంట భూముల్లోకి బాయిల్డ్ రైస్ మిల్లుల కలుషిత నీరు
- ఆందోళనలో రైతులు
- పట్టించుకోని అధికారులు



కాలూరు పరిధిలోని పొలాల్లోకి వస్తున్న వ్యర్థపు నీరు

నిజామాబాద్ రూరల్: నగర శివారులోని కాలూరు, ఖానాపూర్ ప్రాంతాల్లో దాదాపు 100కు పైగా బాయిల్డ్ రైస్ మిల్లులున్నాయి. వాటి నుంచి వెలువడే వ్యర్థపు నీటితో కాలూర్, ఖానాపూర్ గ్రామాల పరిధిలోని వ్యవసాయ భూములన్నీ కలుషితమవుతున్నాయి. రైస్ మిల్లుల యజమానులు ఇష్టానురీతిగా వ్యర్థాలను విడుదల చేయడంతో పంట భూముల్లో మురుగు నీరు చేరి దుర్గంధం వ్యాపిస్తోంది. రైస్ మిల్లు వ్యర్థాల కారణంగా పంట మొత్తం దెబ్బతిని దిగుబడి తగ్గి ఎకరాకు 30 నుంచి 32 క్వింటాళ్ల వడ్లు వచ్చేవి కేవలం పది నుంచి పదిహేను క్వింటాళ్ల వడ్లు మాత్రమే వస్తున్నాయి.

ఈ సమస్య గురించి అనేక సార్లు అధికారులకు కాలూర్, ఖానాపూర్‌వాసులు విన్నవించినా ఎవ్వరు పట్టించుకోలేదు. చివరకు కలెక్టర్ వద్దకు సమస్యను తీసుకువెళ్లినా పరిష్కారం కాలేదు. గతంలో ఎన్నో సార్లు రాస్తారోకోలు, ధర్నాలు చేసినా ఏ అధికారి స్పందించలేదు. స్థానిక, రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డికి సమస్య గురించి విన్నవిస్తే రైస్ మిల్లుల యజమానులతో మాట్లాడి వ్యర్థాల కోసం ప్రత్యేకంగా డ్రైనేజ్‌ను ఏర్పాటు చేస్తామని రైస్ మిల్లర్లు మాట ఇచ్చారు కాని ఇప్పటి వరకు డ్రైనేజ్ నిర్మాణం గురించి ఊసేలేకుండా పోయింది. ఈ వ్యర్థాల వల్ల దీర్ఘకాలిక రోగాలు వస్తున్నాయని కాలూర్, ఖానాపూర్ గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

సమస్యను పరిష్కరించాలి



ఎనిమిది నెలల క్రితం ఈ సమస్యను రూరల్ ఎమ్మెల్యే రేకులపల్లి భూపతి రెడ్డి వద్దకు తీసుకుపోయాం కానీ ఎటువంటి పురోగతి లేదు. అటు అధికారులు సైతం పట్టించుకోకపోవడంతో కాలూర్, ఖానాపూర్‌వాసులు పరిస్థితి ఆయోమయంలో ఉంది. అసలు పంట పొలాలోకి నీరు రాకుండా అధికారులు రైస్‌మిల్లుల యాజమాన్యం చర్యలు తీసుకోవాలి. ఉన్నత అధికారులు సైతం దృష్టి సారించాలని మనవి చేస్తున్నా. – కోర్వ రాజేంద్ర ప్రసాద్, ఖానాపూర్

రైతులకు తీవ్ర అన్యాయం



రైస్‌మిల్ నుంచి వెలువడుతున్న వ్యర్థాలతో కాలూరు, ఖానాపూర్ పరిసర ప్రాంతాల్లోని వ్యవసాయ భూములు నిస్సారవంతంగా మారుతున్నాయి. దీంతో పొలాల్లో పంట దిగుబడి తగ్గి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అధికారులు పట్టించుకొని పరిశ్రమల నుండి వెలువడే వ్యర్థాలను నియంత్రించి రైతులకు న్యాయం జరిగే విధంగా అధికారులు, ప్రజాప్రతినిధులు వ్యవహరించాలని విజ్ఞప్తి చేస్తున్నాను. – సందీప్‌రెడ్డి, కాలూరువాసి

ఉత్తమ విద్య అందించడమే లక్ష్యం



ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులతో పాఠశాల చైర్మన్ మారయ్యగౌడ్, ఉపాధ్యాయులు

నిజామాబాద్అర్బన్: విద్యార్థులకు ఉత్తమ విద్య అందించడమే ఎస్ఎస్ఆర్ డిస్కవరీ పాఠశాల ప్రధాన ఉద్దేశమని పాఠశాల చైర్మన్ మారయ్యగౌడ్ అన్నారు. బుధవారం మాధవనగర్‌లోని పాఠశాలలో సీబీఎస్ఈలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల టాలెంట్‌కు అనుగుణంగా విద్యాబోధన కొనసాగుతుందన్నారు. ఎలాంటి ఒత్తిడి లేకుండా బోధించడంతో విద్యార్థులు ప్రతి ఏటా ఉత్తమ మార్కులు సాధిస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రమశిక్షణ, క్రీడలు ఎంతో ముఖ్యమని వీటిని కూడా పాఠశాలలో కొనసాగిస్తున్నామన్నారు. విద్యార్థులను, వారి తల్లిదండ్రులను సన్మానించారు. పాఠశాల డైరెక్టర్ హరిత గౌడ్, ప్రిన్సిపల్ భాస్కర్, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల సంఖ్యను పెంచాలి



మాట్లాడుతున్న డీఈవో అశోక్

నిజామాబాద్అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో ఈ ఏడాది విద్యార్థుల సంఖ్యను పెంచాలని జిల్లా విద్యాశాఖాధికారి(డీఈవో) అశోక్ అన్నారు. బుధవారం బోర్గాం (పి), నగరంలోని హెచ్‌పీఎస్ పాఠశాలలో ఉపాధ్యాయులకు జరుగుతున్న శిక్షణ కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశామని, విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలన్నారు. బడీడు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించి పాఠశాలకు వచ్చే విధంగా చూడాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. జిల్లా రిసోర్స్‌పర్సన్ గద్దల రమేశ్, పాఠశాల హెచ్ఎం శంకర్, పరిశీలకుడు ప్రభాకర్, తదితరులున్నారు.

సంఘాన్ని ఐక్యంగా బలోపేతం చేద్దాం



మాట్లాడుతున్న కొండ దేవయ్య, పక్కన బాజిరెడ్డి జగన్, సంబారి మోహన్ తదితరులు

- మున్నూరు కాపు సంఘం నాయకులు కొండ దేవయ్య, బాజిరెడ్డి జగన్

నిజామాబాద్‌నాగారం: జిల్లాలో మున్నూరుకాపు సంఘాన్ని ఐక్యంగా ఉండి బలోపేతం చేద్దామని జిల్లా నాయకులు కొండ దేవయ్య, బాజిరెడ్డి జగన్ అన్నారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో జరుగబోయే జనగణన కార్యక్రమంలో భాగంగా కులగణనను కూడా చేపట్టాలన్న మోదీ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. కులగణన కార్యక్రమంలో మున్నూరుకాపుల వివరాలు ఇచ్చే సమయంలో వారి పేరు చివర 'పటేల్' అని చేర్చి రాయాలని కోరారు. ఇందులోనే పలు రాష్ట్రస్థాయిలో మున్నూరుకాపు సంఘానికి ఎన్నికలు నిర్వహించాలన్నారు. గుజరాత్ లో మాదిరిగా పటేల్ ఉద్యమం తీసుకువచ్చి ప్రభుత్వాన్ని ఒప్పించి 'పటేల్ గెజిట్' తెప్పించాలన్నారు.

రూరల్ కమిటీల ఎన్నిక

నిజామాబాద్ రూరల్ కార్యనిర్వాహక కమిటీ సభ్యులుగా దాసరి లక్ష్మీనరసయ్య పటేల్, సంబారి మోహన్ పటేల్, ఆకుల తిరుమల పటేల్, కోర్వ దేవేందర్ పటేల్, పులి సాగర్ పటేల్, పుప్పాల శ్రీనివాస్ పటేల్‌లను ఎన్నుకున్నారు.

నిజామాబాద్ అర్బన్ కమిటీ

కిషన్‌రెడ్డి పటేల్, నర్సింగ్ రావు పటేల్, సంతోష్ వైసాక్షి పటేల్, బొబ్బిలి నర్సయ్య పటేల్, న్యాలం రాజు పటేల్, అగ్గు షేర్ సంతోష్ పటేల్‌లను ఎన్నుకున్నారు.

బాల్కొండ కమిటీ

జక్కా రాజేశ్వర్, గుల్లే రాజేశ్వర్, చెంగల్ మహేష్, నెల్ల లింగన్న, పుప్పాల నరేశ్, రేగుంట దేవేందర్‌లు ఎన్నికయ్యారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో లింగం నాయక్

డిచ్‌పల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని డిచ్‌పల్లి ఎంపీడీవో లింగం నాయక్ సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీవో శ్రీనివాస్ గౌడ్‌తో కలిసి అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, నిర్మాణ పనులపై ఎంపీడీవో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పైలట్ గ్రామంగా ఎంపికైన కమలాపూర్‌తో పాటు మండలంలోని అన్ని గ్రామాల ఇందిరమ్మ ఇళ్ల అర్హుల జాబితాను కలెక్టర్ ఆమోదం కోసం పంపించినట్లు తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు మంజూరైన ఇళ్ల పనులను త్వరగా మొదలు పెట్టించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హౌసింగ్ ఏఈ అన్నపూర్ణ, కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.



హాజరైన పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది

ధాన్యం కుప్పల పరిశీలన



జక్రాన్‌పల్లిలో రోడ్లపై ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఏఐయూకేఎస్ నాయకులు

జక్రాన్‌పల్లి: జక్రాన్‌పల్లిలో రోడ్లపై పోసిన ధాన్యం కుప్పలను బుధవారం అఖిల భారత ఐక్య రైతు సంఘం(ఏఐయూకేఎస్) జిల్లా ప్రతినిధి బృంద సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.ప్రభాకర్, దేవారంలు మాట్లాడుతూ.. లారీలు, హమాలీల కొరత, రైస్‌మిల్ యజమానులు అదనంగా తరుగు కోసం తొందరగా అన్‌లోడ్ చేసుకోకపోవడం మూలంగా ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. వెంటనే స్పందించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. తరుగు తీసుకోకుండా, లారీలను వెంటనే ఏర్పాటు చేసి రోడ్లపై ఉన్న ధాన్యాన్ని తరలించాలని డిమాండ్ చేశారు. ఆలస్యానికి కారణమైన అధికారులు, రైస్‌మిల్ యజమానులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు సురేష్, బాబన్న, కిషన్, సాయిలు, ఆకుల గంగారాం, బాలయ్య, గంగాధర్, తదితరులున్నారు.

సినిమాలు

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1 సింగిల్ -11.00, 4.40
హిట్-1.30, 7.30
జగదేకవీరుడు అతిలోక సుందరి-10.30
స్క్రీన్-2 సింగిల్-1.30, 7.30, 10.30
స్క్రీన్-3 జగదేకవీరుడు అతిలోక సుందరి-11.00, 4.30
శుభం-1.40, 7.20, 10.20

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1 నటిన్-11.20,
సింగిల్-1.40, 7.25, 10.10 -రైడ్-2(హిందీ)-4.25
స్క్రీన్-2 తుడరుమ్-11.20
శుభం-2.40, 5.20, 8.00, 10.40
స్క్రీన్-3 జర్నీ-11.00 - రైడ్-2(హిందీ)-1.45
కలియుగం-8.00 - హిట్-4.45, 10.25
స్క్రీన్ -4 సీఎం పెళ్లాం-11.40
జగదేకవీరుడు అతిలోకసుందరి-2.30
బ్లైండ్‌స్పాట్-5.40- రైడ్-2(హిందీ)-7.45
తుడరుమ్-10.40
లలితామహల్ శుభం దేవి సింగిల్
నటరాజ్ జగదేకవీరుడు అతిలోకసుందరి
విజయ్ హిట్

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	96,400	వెండి(కిలో)	1,01,500
22 క్యారెట్స్	88,985	– నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	180
		లైవ్	140
స్కిన్‌లెస్	200	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	8	15	గాజరుగడ్డ	30	60
బెండకాయ	30	50	పచ్చిమిర్చి	30	50
బీరకాయ	40	60	దోసకాయ	20	40
దొండకాయ	25	40	ఆలుగడ్డ	25	50
బీర్నీసుకాయ	100	150	గోబిగడ్డ	10	20
కాకరకాయ	30	50	గోబిపువ్వు	30	50
వంకాయ	30	50	బీట్‌రూట్	25	50
పాలకూర	20	40	కరివేపాకు	40	60
మెంతికూర	60	90	చామగడ్డ	40	60
కొత్తిమీర	50	80	గోరుచిక్కుడు	40	60
పుదీనా	50	80	చిక్కుడుకాయ	40	60
క్యాప్సికం	40	80	మామిడికాయ	30	50

–సుభాష్‌నగర్